సాక్షి
అనకాపల్లి

మంగళవారం । 30 । మే । 2023



అలసత్వం వద్దు

స్పందన అర్జీల పరిష్కారంలో అధికారులు ఎటువంటి అలసత్వం ప్రదర్శించవద్దని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. 8లో



రైతులకు మేలు

తంగేడులో నూతనంగా నిర్మించిన విత్తన శుద్ధి కర్మాగారాన్ని ఎంపీ సత్యవతి సోమవారం ప్రారంభించారు. 8లో



నేడు చందనం అరగదీత

సింహాచలం: సింహగిరిపై మంగళవారం మూడో విడత చందనం అరగదీత ప్రారంభం కానుంది.

న్యూస్‌రీల్

108 వాహనంలో ప్రసవం



బిడ్డతో ఈఎంటీ ప్రవీణ్‌కుమార్, ఆశ కార్యకర్త వరహాలమ్మ

మాడుగుల రూరల్ : పురిటి నొప్పులతో బాధపడుతున్న బొడ్డరేవు గిరిజన గ్రామానికి చెందిన గర్భిణి పాడి సత్యవతి (22) సోమవారం ఉదయం 108 వాహనంలో ప్రసవం పొందింది. మండలంలోని శంకరం పంచాయతీ బొడ్డరేవు గ్రామానికి చెందిన ఆమె తొలికాన్పు కావడంతో ఉదయం పురిటి నొప్పులు మొదలయ్యాయి. దాంతో 108కు ఆశ కార్యకర్త గెమ్మిలి వరహాలమ్మ ఫోన్ చేయగా, బుచ్చెయ్యపేట నుంచి వచ్చిన అంబులెన్స్‌లో ఎక్కించారు. మార్గమధ్యంలో కాశీపురం అడ్డరోడ్డు వద్దకు రాగానే పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో వాహనం నిలుపుదల చేసి, అతి కష్టమ్మీద ఈఎంటీ ఎ. ప్రవీణ్ కుమార్ ప్రసవం చేశారు. సత్యవతి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆశ కార్యకర్త సహకారంతో తల్లీ బిడ్డను, కె.జె.పురం పీహెచ్‌సీకి తరలించారు. ఈఎంటీ ప్రవీణ్‌కుమార్, పైలట్ అప్పలరాజు, ఆశ సేవలను పలువురు ప్రశంసించారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో రికార్డు స్థాయిలో ప్రసవాలు



ఓపీని పరిశీలిస్తున్న రామ్మూర్తి

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయంలో మే 1 నుంచి 15వ తేదీ వరకు రికార్డు స్థాయిలో 450 ప్రసవాలు జరిగాయని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ జి.రామ్మూర్తి తెలిపారు. మాతా శిశు విభాగంలో వైద్య సేవలు అందించిన వైద్యులను, సిబ్బందిని ఆయన అభినందించారు. వైద్యాలయంలో వివిధ విభాగాలను సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్‌తో కలసి, సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గైనిక్ విభాగంలో పూర్తి స్థాయిలో వైద్యులను ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. ఆస్పత్రిలో నాణ్యమైన వైద్యం అందించడంతో అన్ని విభాగాల్లో రోగుల సంఖ్య పెరిగిందన్నారు. అత్యవసర విభాగంలో నిత్యం ముగ్గురు వైద్యులు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనరల్ వైద్యులు, సర్జన్, ఎముకల వైద్యులు, చర్మవ్యాధుల నిపుణులను నియమించినట్లు చెప్పారు. చిన్నపిల్లలకు ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మూనూరు శ్రీను, ఎ.వి.రత్నకుమారి, పొలమరశెట్టి మురళి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయినికి వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణం



వ్యాయామ ఉపాధ్యాయిని దేవి

నర్సీపట్నం: జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో వ్యాయామ ఉపాధ్యాయిని గుడివాడ దేవి సత్తా చాటారు. గొలుగొండ మండలం కొత్తమల్లంపేట ప్రభుత్వ హైస్కూల్‌లో ఆమె విధులు నిర్వర్తిస్తున్నారు. వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారు హైదరాబాద్ పోస్టల్ కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 27, 28 తేదీల్లో జాతీయ మాస్టర్స్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. 15 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో వ్యాయామ ఉపాధ్యాయని దేవి పాల్గొని 87 కిలోల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



మొదలైన పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

తుమ్మపాల: పాలిసెట్–2023 కౌన్సెలింగ్ రేబాకలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ప్రారంభమయ్యింది. మొదటి రోజు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 1 నుంచి 12 వేల మధ్య ర్యాంకులు సాధించిన విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరైనట్లు ప్రిన్సిపల్ ఐవిఎస్ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. తొలి రోజు కౌన్సెలింగ్‌లో రేబాక కాలేజీలో మొత్తం 67 మంది పాల్గొని సీట్లు సాధించారు. మంగళవారం 12,001 ర్యాంకు నుంచి 28,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ జరుగుతుంది.



నర్సీపట్నంలో భారీ బైక్ ర్యాలీ (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



యలమంచిలి బైక్ ర్యాలీలో పాల్గొన్న బొడ్డేడ ప్రసాద్, సుకుమారవర్మ



చోడవరం కొత్తూరు జంక్షన్ వద్ద మానవహారం (ఇన్‌సెట్) నినాదాలు చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

నిరసనల వెల్లువ

- పేదల పండగంటే చంద్రబాబుకు ఎందుకంత హేళన
- ఇళ్ల పట్టాల పంపిణీని చూసి ఓర్వలేకపోతున్నారు
- టీడీపీ అధ్యక్షుడి వ్యాఖ్యలపై ప్రజాగ్రహం
- నిరసనగా బైక్ ర్యాలీలు, మానవహారాలు

సాక్షి, అనకాపల్లి: పండగలా జరిగిన పట్టాల పంపిణీపై ఎందుకంత అక్కసు.. పేదలకు మేలు జరుగుతుంటే ఓర్వలేకపోతున్నారెందుకు.. చంద్రబాబుకు మొదటి నుంచీ సామాన్యులపై చులకన భావమే.. టీడీపీ ప్రభుత్వ హయాంలో మేలు చేయలేదు సరికదా ఇన్నాళ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుంటే హేళనగా మాట్లాడతారా.. అంటూ ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అంతటా చంద్రబాబు వ్యాఖ్యలపై వ్యతిరేకత వ్యక్తమైంది. పలుచోట్ల బైక్ ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. పేదవారంటే చంద్రబాబుకు మొదటి నుంచీ చులకన భావమేనని.. అధికారంలో ఉన్నప్పుడు పేదలపై, దళితులపై దాడులు చేయించాడని, అధికారం పోయినా బుద్ధి రాలేదని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ఇళ్ల పట్టాలు అందిస్తుంటే చూసి తట్టుకోలేకపోతున్నారని ధ్వజమెత్తారు. హేళనగా మాట్లాడితే సహించబోమని స్పష్టం చేశారు. చంద్రబాబు దిష్టిబొమ్మని తగలబెట్టి నిరసన తెలిపారు.

- ప్రభుత్వ విప్, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వెంకన్నపాలెం నుంచి చోడవరం కొత్తూరు జంక్షన్ వరకు వందలాది మోటారు సైకిళ్లతో ఐదు కిలోమీటర్ల మేర బైక్ ర్యాలీ చేశారు. కొత్తూరు నాలుగురోడ్ల జంక్షన్‌లో మానవహారం నిర్వహించి, నిరసన తెలిపారు. పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలు వారి సమాధులకే సరిపోవని ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించడాన్ని ధర్మశ్రీ దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో కూడా టీడీపీకి ప్రజలు మరోసారి బుద్ధి చెబుతారన్నారు. ధర్మశ్రీ బుచ్చెయ్యపేటలో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు మరోసారి రైతులను, మహిళలను నిరుద్యోగుల్ని మోసగించి గద్దె నెక్కాలని మాయమాటలు చెబుతున్నాడని విమర్శించారు. మహానాడులో ఆయన ఇచ్చిన హామీలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఇలాంటి కబుర్లు చెప్పి గతంలో ఎలా వెన్నుపోటు పొడిచాడో ప్రజలు మరచిపోలేదన్నారు. చంద్రబాబు 650 వాగ్దానాలతో ప్రచార పోస్టర్లు వేసి 10 వాగ్దానాలు కూడా నెరవేర్చని మోసగాడని.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 98.5 శాతం వాగ్దానాలు నెరవేర్చి మాటమీద నిలబడ్డ మొనగాడిగా పేరు తెచ్చుకున్నారని ధర్మశ్రీ అన్నారు.
- నర్సీపట్నంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో 2 వేల బైక్‌లతో భారీ బైక్ ర్యాలీ చేశారు. చంద్రబాబుతోపాటు అయ్యన్నపాత్రుడి దిష్టిబొమ్మను తగలబెట్టి నిరసన తెలియజేశారు. అబిద్ సెంటర్‌లో బైక్ ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు, అయ్యన్నపాత్రుడు మరోసారి ప్రజలను మోసగించడానికి సిద్ధమయ్యారని విమర్శించారు. 2024లో ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేదన్నారు. ప్రజలు మరోసారి టీడీపీ నాయకులను తరిమికొడతారన్నారు.
- యలమంచిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో భారీగా బైక్ ర్యాలీ చేశారు.
- డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ పాల్గొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తే పేదలను అవమానించడంగానే ప్రజలు భావిస్తారని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. 14 ఏళ్లు పాలించావు కదా ఎప్పుడైనా పట్టాలు ఇచ్చావా అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబునాయుడును, ఆయన కొడుకు లోకేష్‌ని సెంటు స్థలంలో పూడ్చడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారని ధ్వజమెత్తారు.

ఆశలు గల్లంతు

- శారదానదిలో మునిగిన ఇద్దరు బాలలు
- తాతగారింట తీవ్ర విషాదం
- గల్లంతైన ఇద్దరూ వరుసకు బావామరుదులు
- కొనసాగుతున్న గాలింపు



వెదురుపర్తిలో బాలురు గల్లంతైన ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తహసీల్దార్ సురేష్‌కుమార్ (ఇన్‌సెట్) అనిల్, ప్రసాద్ (ఫైల్ ఫొటోలు)

కె.కోటపాడు: సెలవులకు తాత ఇంటికి వచ్చిన ఇద్దరు బాలలు నీటి పాలైన ఘోర దుర్ఘటన విషాదం నింపింది. శారదా నదిలో గల్లంతైన ఇద్దరూ వరుసకు బావాబావమరుదులు కావడంతో రెండు కుటుంబాల వారు కన్నీరుమున్నీరవుతున్నారు. వారు క్షేమంగా తిరిగి రావాలని వేయి దేవుళ్లకు మొక్కకొని ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. కె.కోటపాడు మండలంలోని వెదురుపర్తి వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు ఈ విషాదం చోటు చేసుకుంది. వెదురుపర్తిలో పలివెల అప్పన్న ఇంటికి ఆయన కుమార్తె ఏడిద సూర్యకాంతం కుమారుడు ప్రసాద్ (17) సెలవులకు వచ్చాడు. వీరిది నక్కపల్లి మండలం చందనాడ గ్రామం. అప్పన్న కుమారుడి మరదలు లక్ష్మి, ఆమె కుమారుడు పిల్లి అనిల్ (14) కూడా సెలవులకు అప్పన్న ఇంటికి వచ్చారు. వారిది యలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం గ్రామం. లక్ష్మి మాసిన దుస్తులు ఉతకడానికి సమీపంలోని శారదా నదికి కుమారుడు అనిల్, ప్రసాద్‌లను తోడుగా తీసుకెళ్లింది. ఆమెకు కొంతసేపు సహాయ పడిన తర్వాత అనిల్, ప్రసాద్‌లు నదిలోకి స్నానానికి దిగారు. ఈత కొడుతూ లోతు ప్రదేశానికి వెళ్లి ఊబిలో కూరుకుపోయారు. వారిని రక్షించేందుకు లక్ష్మి చీరను అందించిన ప్రయోజనం లేకపోయింది. ఆమె కూడా నదిలో దూకి ఊబిలో కూరుకుపోతూ కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల పశువులు మేపుతున్న స్థానికులు వచ్చి ఆమెను రక్షించారు. అనిల్, ప్రసాద్‌లను రక్షించడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అనిల్ లక్ష్మికి పెద్ద కుమారుడు కాగా, సూర్యకాంతానికి ప్రసాద్ ఒకే కుమారుడు.

దొరకని ఆచూకీ

నదిలో గల్లంతైన అనిల్, ప్రసాద్‌ల కోసం స్థానిక ఈతగాళ్లు, అనకాపల్లి ఫైర్ స్టేషన్ సిబ్బంది గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం విశాఖ నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించి గాలింపు జరపనున్నట్లు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. బాధితురాలు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ప్రమాదకరంగా శారదా నది ప్రాంతం

వెదురుపర్తి, తేగాడ గ్రామాల మధ్య శారదానది పరివాహక ప్రాంతం ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ నదీ ప్రవాహ వేగం, ఇసుక, మట్టి కోసం తవ్వకాల వల్ల పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వాటిలో ఊబి నెలకొని ప్రమాదాలకు దారితీస్తోంది. పదేళ్ల క్రితం తేగాడకు చెందిన ఒకరు ప్రమాదవశాత్తు గోతిలో పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. తాజాగా అనిల్, ప్రసాద్ గల్లంతయ్యారు.

శిలాఫలకాల మంత్రి అయ్యన్నపాత్రుడు

ఎమ్మెల్యే గణేష్ ఎద్దేవా

నర్సీపట్నం: 'మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన కాలంలో నువ్వు ఎంత అభివృద్ధి చేశావో.. నేనెంత చేశాననే దానిపై బహిరంగ చర్చకు సిద్ధమా' అంటూ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సవాల్ విసిరారు. పెద్దచెరువును ట్యాంక్ బండ్ చేస్తానని, నూకాలమ్మతల్లి గుడిని పునర్నిర్మిస్తానని, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తానని, వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి వరకు రోడ్డు నిర్మిస్తానని, వివిధ కులాలకు కల్యాణ మండపాలు కట్టిస్తానని వాగ్దానాలు చేసి చివరికి శిలాఫలకాల మంత్రిగా మిగిలిపోయావని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తాను.. అయ్యన్నపాత్రుడు చేతకాక చేతులెత్తేసిన మున్సిపాలిటీలోని ఇంటి పన్నులను సీఎం వైఎస్ జగన్ సహకారంతో 25 శాతం తగ్గించామన్నారు. గొలుగొండ మండలంలో స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి ఆరిలోవ అటవీ ప్రాంతంలో మూడు కిలోమీటర్ల మేర రోడ్డు వేయలేని దద్దమ్మ అయ్యన్నపాత్రుడు అన్నారు. తాము కొద్ది రోజుల్లో రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు.

నియోజకవర్గానికి రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల తీసుకువచ్చామని, రూ.166 కోట్లతో మున్సిపాలిటీలో భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. త్వరలోనే ఇంటింటికీ కుళాయిలు ఇస్తామన్నారు. మెయిన్ రోడ్డు విస్తరణ చేస్తున్నామన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన చిన్నారులు



పతకాలు సాధించిన క్రీడాకారులు

నర్సీపట్నం: జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో నింజాస్ అకాడమీకి చెందిన ఎనిమిదిమంది క్రీడాకారులు మెడల్స్ సాధించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ వారు అడ్డురోడ్డులో నిర్వహించిన సబ్ జూనియర్ పోటీల్లో కె.శర్వాణి, పి.ప్రణీత్, ఎం.ప్రేమ్ విఘ్నేష్ బబ్బులు, మణికంఠ గోల్డ్ మెడల్స్, పి.శిరీష, పి.భాను, బి.నవదీప్ సిల్వర్, సిహెచ్.చరణ్ బాలాజీ కాంస్య పతకాలు సాధించారు.

ఎస్ఎస్‌సీ సప్లిమెంటరీ పరీక్షలకు గట్టి ఏర్పాట్లు



పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి

తుమ్మపాల : జూన్ 2 నుంచి జిల్లాలో జరగనున్న ఎస్ఎస్‌సీ సప్లిమెంటరీ పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా నిర్వహించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. ఎస్ఎస్‌సీ సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాటుపై వెబ్‌ఎక్స్ ద్వారా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 21 పరీక్ష కేంద్రాల్లో సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2 నుంచి 10 వరకు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 12 వేల మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. పరీక్షలకు వివిధ శాఖల అధికారులతో ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్ అనుమతించకూడదన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, లైట్లు, మంచినీరు వంటి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష పత్రాలను తరలించే సమయంలో పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలకు గంట ముందుగా చేరుకునే బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, సీజనల్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు వైద్య శిబిరాల ద్వారా అందుబాటులో ఉండాలన్నారు. సమీక్ష అనంతరం పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణపై జరిగిన సమావేశంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని కలెక్టర్‌తో పాటు జేసీ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పొల్యూషన్ బోర్డు అధికారి ఎ.శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరవాడ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



మహిళా పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

పలు రికార్డుల పరిశీలన

పరవాడ: అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వెంకట మురళీకృష్ణ సోమవారం పరవాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా స్టేషన్ రికార్డులను పరిశీలించారు. నేరాల సంఖ్య, పెండింగ్ కేసులు, శాంతి భద్రతల పరిరక్షణపై ఆరా తీశారు. స్టేషన్‌లో విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు. రహదారి భద్రత , ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫార్మా పరిశ్రమలకు రాకపోకలు సాగిస్తున్న వాహనాల ట్రాఫిక్‌ను ఏ విధంగా నియంత్రించాలో సిబ్బందికి అవగాహన కల్పించారు. సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసు సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. మహిళా పోలీసుల సేవలను పోలీస్ స్టేషన్ అధికారులు సద్వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ క్రైం, దిశ యాప్‌లపై మహిళా పోలీసు సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ వెంకటమురళీకృష్ణ సూచించారు. పరవాడ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ, సీఐ పి.ఈశ్వరరావు, ఎస్‌ఐలు సురేష్, మల్లేశ్వరరావు, తేజేశ్వరరావు పాల్గొన్నారు.

జీడికి సిండికేట్ దెబ్బ



స్థానికంగా జీడిపిక్కల ఫ్యాక్టరీలో జీడి పప్పు తయారు చేస్తున్న మహిళలు




రేటు లేక రైతు ఇంటి వద్ద ఆరబోసుకున్న జీడి రైతు

- దిగుబడి ఉన్నా దక్కని ధర
- రేటు తగ్గించేసిన వ్యాపారులు
- రెండు నెలల కిందటితో పోల్చితే బస్తాకు రూ.2,000 తక్కువ

నాతవరం: జీడి పిక్కల ధరలు నేలచూపు చూస్తున్నాయి. ప్రకృతి కరుణించి దిగుబడి పెరిగినా రేటు తగ్గిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర తగ్గించేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో ఉన్న ధరతో పోలిస్తే ఇప్పుడు బస్తాకు రూ.2 వేల వరకూ తగ్గింది. జిల్లాలో వరి పంట తరువాత అధిక విస్తీర్ణంలో రైతులు జీడి మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది జీడి పూతపై మంచుపడడంతో మొదట్లో అన్నదాతలు కంగారు పడ్డారు. తర్వాత వాతావరణం అనుకూలించడంతో ఆశించిన విధంగానే జీడి పిక్కల దిగుబడి వచ్చింది. జిల్లాలో 24 మండలాల్లో సుమారుగా 31 వేల హెక్టార్లలో జీడి మామిడి తోటలు సాగు చేస్తున్నారు. నాతవరం, రావికమతం, చోడవరం, యలమంచిలి, రోలుగుంట ఎస్.రాయవరం, మాకవరపాలెం, గొలుగొండ, నక్కపల్లి, కె.కోటపాడు, కోటవురట్ల తదితర మండలాల్లో అధికంగా జీడితోటలున్నాయి. ఉద్యానవనశాఖ అధికారుల లెక్కల ప్రకారం ఈ ఏడాది ఎకరానికి 400 కిలోలకు పైగా దిగుబడి వచ్చింది. దీన్ని బట్టి పరిశీలిస్తే హెక్టారుకు వెయ్యి కిలోల జీడి పిక్కల దిగుబడి లభించింది. జిల్లాలో జీడి పిక్కల ఫ్యాక్టరీలు పెద్దవీచిన్నవి కలిపి 150కి పైగా ఉన్నాయి. కేరళ రాష్ట్రానికి చెందిన వారు నాతవరం, నర్సీపట్నం, రోలుగుంట, కె.కోటపాడు, కోటవురట్ల, పాయకరావుపేట, నక్కపల్లి, మాకవరపాలెం, అనకాపల్లి, యలమంచిలి తదితర మండలాల్లో మండలానికి రెండు నుంచి నాలుగు చొప్పున పెద్ద ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. అదే చిన్న ఫ్యాక్టరీలు అయితే ప్రతి గ్రామంలో ఏర్పాటు చేశారు. రైతులు పండించిన జీడి పిక్కలను జీడి పరిశ్రమ యాజమాన్యాలు నేరుగా కొనుగోలు చేయడంలేదు. ప్రైవేటు వ్యాపారుల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. మొదట్లో మార్చి నెలలో 80 కిలోల బస్తాను రూ.8500 నుంచి రూ.9వేల ధరతో కొనుగోలు చేశారు. అప్పట్లో జీడి పిక్కలు దిగుబడి తక్కువగా ఉండేది. ఏప్రిల్ నుంచి జీడి పిక్కలు దిగుబడి పెరగడంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి ఒక్కసారిగా బస్తా ధరను రూ.6300కు తగ్గించేశారు. ఇప్పుడు పిక్కల నాణ్యత పేరుతో గ్రామంలో ఇష్టం వచ్చిన రేటుకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇంతకుముందు జీడి పిక్కల కొనుగోలుకు బయటి జిల్లాల నుంచి వ్యాపారులు వచ్చేవారు. ఇప్పుడు స్థానికంగా ఉన్న వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ఇతర ప్రాంతాల వ్యాపారులను ఇక్కడికి రాకుండా అడ్డుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నేరుగా ఫ్యాక్టరీ యాజమాన్యాలు రైతుల నుంచి కొనుగోలు చేస్తే జీడి పిక్కలకు మద్దతు ధర వస్తుందని అంటున్నారు.

సిండికేట్ల నుంచి కాపాడండి



ప్రైవేటు వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి జీడి పిక్కల రేటు పెరగకుండా చేస్తున్నారు. దిగుబడి బాగున్నా దీనివల్ల లబ్ధి చేకూరడం లేదు. డీఆర్‌డీఏ కొనుగోలు చేస్తే రైతుకు గిట్టుబాటు ధర వస్తుంది. వారు రైతుల నుంచి జీడిపిక్కలు సేకరిస్తే దళారీలకు అడ్డుకట్ట వేసినట్టు అవుతుంది. ఈ ఏడాది పంట రాకముందు రేటు అధికంగా ఉండేది. పిక్కలు వచ్చాక రేటు బాగా తగ్గించేశారు. రేటు లేక పిక్కలను ఇంట్లోనే నిల్వ చేసుకున్నాను. దేవుడు వరమిచ్చినా పూజారి అడ్డుకున్నట్టు ఉంది మా పరిస్థితి.

– **టి.తాత**, జీడి రైతు, నాతవరం

వచ్చే ఏడాది నుంచి కొనుగోలు చేస్తాం



రైతుల నుంచి నేరుగా ఓలం జీడి పరిశ్రమ యాజమాన్యం జీడి పిక్కలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల కంపెనీ యాజమాన్యం, వెలుగు అధికారులు చర్చించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వచ్చే ఏడాది నుంచి జీడి రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయించి, దళారీ వ్యవస్థకు చెక్ పెడతాం.

– **మర్రి లక్ష్మి**, వెలుగు ఏపీఎం, నాతవరం

ఎర్రవాయి గ్రామాలకు మెరుగైన వైద్య సేవలు

తురకలపూడి పీహెచ్‌సీ భవనం ప్రారంభోత్సవంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ


తురకలపూడి ఆస్పత్రి భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: ఎర్రవాయి గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా కృషి చేస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. బుచ్చెయ్యపేట మండలం తురకలపూడిలో నాడు – నేడు నుంచి రూ.1.61 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ఆయన స్థానిక నాయకులతో కలిసి సోమవారం ప్రారంభించారు. దశాబ్దాలకుపైగా శిథిల భవనంలో ఆస్పత్రి ఉండటంపై స్థానిక నాయకుల వినతి మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు. జగనన్న ఆమోదంతో కొత్త భవనం నిర్మాణానికి నాడు– నేడు నిధులు మంజూరు చేయించానన్నారు. ఇక్కడ భవనం నిర్మాణంతోపాటు అన్ని సదుపాయాలు కల్పించి 24 గంటలపాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చేస్తానన్నారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారి ఎ.హేమంత్, వైద్యాధికారి డి. సంధ్యారాణిలకు సూచించారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, సర్పంచ్ గోవింద, ఎంపీటీసీ సత్యవతి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి భూషణం పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతుడు చిన్నయ్య(ఫైల్ ఫోటో)

నర్సీపట్నం : ఏరియా ఆస్పత్రి సమీపంలో మెయిన్ రోడ్డు పక్కన ఓ వ్యక్తి మృతదేహం పడి ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని టౌన్ ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండలంలో గురంధరపాలెంకు చెందిన దారపూడి చిన్నయ్య(50) వృత్తిరీత్యా తాపీమేస్త్రీ. రోజు మాదిరిగానే సోమవారం తాపీ పనికి వెళ్తున్నట్టు కుటుంబ సభ్యులకు తెలిపి అతను నర్సీపట్నం వచ్చాడు. అయితే మెయిన్ రోడ్డు పక్కన మృతి చెంది పడి ఉన్నాడు. మృతికి కారణాలు తెలియరాలేదు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు అచ్చిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- కలెక్టరేట్ 'స్పందన'కు 178 అర్జీలు


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల: స్పందన దరఖాస్తులు రీఓపెన్ కాకుండా సమస్యకు నాణ్యమైన పరిష్కారం జరిగేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయనతోపాటు జేసీ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. స్పందన దరఖాస్తులు పరిష్కారంలో అధికారులు ఎటువంటి అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఏప్రిల్, మే నెలలకు సంబంధించి జీతాలు తక్షణమే చెల్లించాలని అనకాపల్లి పట్టణంలో జీవీఎంసీ ప్రధాన హైస్కూల్ ఉపాధ్యాయులు కలెక్టర్‌కు విన్నవించారు. ఈ విషయమై డీఈవో దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి పరిష్కారం లేదంటూ వాపోయారు. స్పందన నమోదు కేంద్రం వద్ద వేచి ఉన్న దివ్యాంగులు, వృద్ధుల వద్దకు డీఆర్వో వెంకటరమణ వచ్చి సమస్యలు తెలుసుకున్నారు. ఈ వారం మొత్తం 178 అర్జీలు నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. పలు ప్రజా సంఘాల నిరసనల నేపథ్యంలో రూరల్ సీఐ రవికుమార్, ఎస్సై నరసింహరావు ఆధ్వర్యంలో భద్రతా చర్యలు తీసుకున్నారు.

ఉపాధి వేతనదారుల నిరసన

సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో ఉపాధి వేతనదారులు కలెక్టరేట్ వద్ద నిరసన చేశారు. ప్రతి కుటుంబానికి 200 రోజుల పని కల్పిస్తూ రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేసవి భత్యం, ఇతర అలవెన్స్ కల్పిస్తూ పాత మస్టర్ విధానాన్నే అమలు చేయాలని కోరారు. రవాణా ఖర్చులతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. డీఆర్వో వెంకటరమణ, డ్వామా పీడీ సందీప్ వారి వద్దకు చేరుకుని సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు.

దేవాలయం భూములను కాపాడాలి...

మునగపాక మండలం టి.సిరసపల్లిలో వీరభద్ర స్వామి ఆలయ భూములను కొంతమంది పేరున మార్చేసిన ఎండోమెంట్, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన అర్చకుడు అప్పికొండ శివ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. సర్వే నంబరు 115–1లో 2.20 ఎకరాల దేవాలయం భూమిని అన్యాక్రాంతం చేశారని, తరచూ ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయాడు. కలెక్టర్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రేషన్ కార్డు ఉన్నా బియ్యం ఇవ్వడం లేదు

వి.మాడుగుల మండలం శంకరం పంచాయతీ బొడ్డరేవు గ్రామానికి చెందిన గిరిజన మహిళ కొర్రా లక్ష్మికి రేషన్ కార్డు ఉన్నప్పటికి బియ్యం ఇవ్వడం లేదని కలెక్టర్‌కు మొరపెట్టుకుంది. 30 ఏళ్లగా గ్రామంలో నా కుటుంబంతో నివాసముంటున్నానని తెలిపింది.

దివ్యాంగుల కోటా ఉద్యోగాలు పెంచాలి

జిల్లాలో దివ్యాంగుల కోటాలో తక్కువ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయడం వల్ల అనేక మంది ఉన్నత విద్యావంతులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నాం. మొత్తం ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద కోటవురట్ల మండలానికి చెందిన మేము సైతం దివ్యాంగుల సమైక్య సభ్యులు నిరసన తెలిపారు. అనంతరం డీఆర్వో వెంకటరమణకు వినతిపత్రం అందించారు.

ఎస్పీ కార్యాలయంలో స్పందనకు 39 అర్జీలు

అనకాపల్లి టౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమానికి 39 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు.

అర్జీదారుల సమస్యలు వింటూ, చట్టపరిధిలో వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీటింగ్, ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలపై ఎక్కువగా అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన శుద్ధి కర్మాగారంతో రైతులకు మేలు


తంగేడులో విశాఖ సీడ్స్ కంపెనీని ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : రైతులకు ఎంతగానో ఉపకరించే విత్తన శుద్ధి కర్మాగారం స్థానికంగా అందుబాటులో ఉండడం అభినందనీయమని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. తంగేడులో నూతనంగా నిర్మించిన విశాఖ సీడ్స్ విత్తన శుద్ధి కర్మాగారాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగతంగా ఎదిగేందుకు ఒక్కొక్కరూ ఒక్కో వ్యాపారాన్ని ఎంచుకుంటారని కానీ తంగేడు గ్రామ సర్పంచ్ కొరుప్రోలు శివకుమార్ సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేసి 3 జిల్లాల రైతులకు ఉపయోగ పడేలా విత్తన శుద్ధి కర్మాగారాన్ని నిర్మించడం గొప్ప విషయమన్నారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా నాణ్యమైన విత్తనాలు అందించి రైతులకు తోడ్పాటును అందించాలని సూచించారు. వరితో పాటు, అపరాల పంటలకు సంబంధించిన విత్తనాలు ఇక్కడ శుద్ధి చేయబడతాయన్నారు. ప్రభుత్వం తరపున కూడా సహకారం అందిస్తామని, రైతులకు మంచి విత్తనాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ సర్పంచ్ శివ విశాఖ సీడ్స్ కంపెనీ స్థాపించినందుకు అభినందించారు. ఈ ప్రాంత ప్రజలకు ఇది గొప్ప అవకాశం అన్నారు. ఫ్యాక్టరీ ద్వారా వరి, అపరాల పంటలను సేకరించడమే కాకుండా కొంత మంది స్థానిక యువతకు ఉపాధి కలుగుతుందన్నారు. ప్రభుత్వం తరపున కూడా సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్ సీతారామరాజు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ విష్ణుమూర్తి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్.ఎస్ రామచంద్రరాజు, జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ రాజు, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, లక్ష్మీనరసింహరాజు, కిల్లాడ శ్రీనివాసరావు, చిటికెల పాత్రునాయుడు, ఎస్.వి.రమణమూర్తి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..

ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. కోటవురట్ల శివారు గవరపేటలో రూ.10 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాల్‌కు, తంగేడు జంక్షన్‌లో రూ.5 లక్షలు, రామచంద్రపురం జంక్షన్‌లో రూ.5 లక్షలతో నిర్మించే బస్ షెల్టర్లు, పాత గొట్టివాడలో రూ.16 లక్షల నిధులతో డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.


రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆధ్వర్యంలో పాయకరావు పేటలో విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బైకులతో పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.

పెయ్యదూడల జననానికి రాయితీపై ఇంజెక్షన్లు

ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి రామమోహన్‌రావు


ఆడ పెయ్యలను పరిశీలిస్తున్న పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి రామమోహన్‌రావు

నాతవరం: పెయ్య దూడల ఉత్పత్తి పథకం ద్వారా పాడి రైతుల ఆర్థికాభివృద్ధి ధ్యేయంగా ఉమ్మడి జిల్లాలో 158 మంది గోపాలమిత్రులంతా పని చేయాలని ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి రామమోహన్‌రావు అన్నారు. ఆయన సోమవారం మండలంలో శృంగవరం, జిల్లేడుపూడి. వెంకయ్యపాలెం గ్రామాల్లో కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్ ద్వారా జన్మించిన లేగదూడలను పరిశీలించారు. శృంగవరం పశువైద్యశాలలో గోపాలమిత్రులతో సమావేశమై మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం ద్వారా మేలైన పెయ్య దూడలు 90 శాతం జన్మిస్తాయన్నారు. ఆడ పెయ్య పుడితే పాల ఉత్పత్తి పెరిగి రైతులకు ఆదాయం బాగుంటుందన్నారు. కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్ రూ.1,350 కాగా ప్రభుత్వం రైతుకు రాయితీపై రూ.500కే సరఫరా చేస్తుందన్నారు. ఒక వేళ ఇంజెక్షన్ పని చేయకపోతే రైతు సొమ్ము వాపసు చేస్తామన్నారు. గతేడాది ఉమ్మడి జిల్లాలో 3 వేల డోసులు 1,500 పశువులకు చేశామని, ఈ ఏడాది 5 వేల డోసుల వేసి 2,500 పశువులకు ఆడ పెయ్యల జననం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

పశువులు మరణిస్తే రైతుకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పశు వైద్య బీమా సదుపాయం కల్పిస్తుందన్నారు. పశు వైద్యశాఖ పాయకరావుపేట ఏడీ శ్రీనివాసరావు గోపాలమిత్రులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందాలపై పోలీసుల దాడులు

- ఏడుగురిపై కేసు నమోదు
- మూడు కోడిపుంజులు, రూ.2160 నగదు స్వాధీనం


పట్టుబడిన పందెంరాయుళ్ళు, కోడిపుంజులతో ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది

కె.కోటపాడు : పింద్రంగి గ్రామంలో కోడిపందాలు ఆడుతూ ఏడుగురు వ్యక్తులు ఎ.కోడూరు పోలీసులకు సోమవారం పట్టుబడ్డారు. గ్రామంలో కోడిపందాలు జరుగుతున్నట్లు ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు ఎస్.ఐ బి.రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ ఘటనలో కోడిపందాలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకోవడంతో పాటు వారి వద్ద ఉన్న రూ.2160 నగదు, మూడు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసును నమోదు చేసినట్టు ఎస్.ఐ రామకృష్ణ తెలిపారు.

జాతీయ స్థాయి వెటరన్ పోటీల్లో అ'ద్వితీయం'

రిటైర్డు బ్యాంకు మేనేజర్ రామన్నదొరకు రజతం


నిర్వాహకుల నుంచి మెడల్, కప్ అందుకుంటున్న రామన్నదొర

రోలుగుంట: జాతీయ స్థాయి వెటరన్ మెన్ అండ్ ఉమెన్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రోలుగుంట మండలం కంచుగుమలకు చెందిన రిటైర్డు బ్యాంకు మేనేజర్ పరవాడ రామన్నదొర (68) ప్రతిభ చూపించి ద్వితీయ స్థానం సాధించాడు. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఈ నెల 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో తెలంగాణ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి వెటరన్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ద్వితీయ స్థానంలో నిలిచిన రామన్నదొరకు నిర్వాహకులు రజత పతకంతోపాటు కప్ ప్రదానం చేశారు. అతని ప్రతిభపై కుటుంబీకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

తాడులోడు వాహనం ఢీకొని వ్యాన్ బోల్తా



ప్రమాద స్థలంలో సత్తిరాజు మృతదేహం, బోల్తా పడిన వ్యాన్, (ఇన్‌సెట్) ప్రమాదంలో మరణించిన సత్తిరాజు (ఫైల్)

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు


కొయ్యూరు: డౌనూరు పంచాయతీ తులబాలగెడ్డ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సీపట్నంకు చెందిన ఎం.సత్తిరాజు (50) అనే వ్యక్తి మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడడంతో వారిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని కొయ్యూరు ఎస్ఐ రాజారావు సందర్శించి ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. ఆయన విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం నుంచి ఓ వ్యాన్ చింతపల్లికి వెళ్తుండగా ఎదురుగా ఒడిశా నుంచి తాడు లోడుతో వస్తున్న మరో వాహనం తులబాలగెడ్డ మలుపు వద్ద అదుపు తప్పి వ్యాన్‌ను ఢీకొందన్నారు. దీంతో వ్యాన్ బోల్తా పడి అందులో ఉన్న ఎం.సత్తిరాజు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన డ్రైవర్ గోవింద్, వంశీతో పాటు మరో మహిళను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వోద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


నిరసన దీక్ష చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్: పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.కె.బాబూరావు కోరారు. స్థానిక నెహ్రూ చౌక్ సమీపంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సోమవారం ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. సీపీఎస్ రద్దు చేసి ఓ.పి.ఎస్‌ను పునరుద్ధరించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, డీఏ, ఏరియర్సు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎ.నాగేశ్వరరావు, పి.వి.రమణ, సభ్యులు శ్రీను, లక్ష్మి పాల్గొన్నారు.

మలేషియాకు చేరుకున్న ఇండియన్ నావల్ షిప్


మలేషియా తీరం వద్ద నావల్ షిప్

మల్కాపురం: పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన ఇండియన్ నావల్ షిప్ మలేషియాలో పోర్ట్ క్లాంగ్ తీరానికి సోమవారం చేరుకుంది. తూర్పు నావికాదళం విస్తరణలో భాగంగా భారత్, మలేషియా దేశాల మధ్య బలమైన స్నేహ బంధాలను పటిష్టం చేసే అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ఇండియన్ నావిల్ షిప్ (యుద్ధ నౌక) మలేషియా నావల్ ప్రాంతానికి చేరింది. ఈ నెల 31వ తేదీ వరకు ఈ నౌక మలేషియా దేశతీరంలో విహరిస్తుంది. అక్కడ అధికారులతో ఇండియన్ నావల్ షిప్ అధికారులు ముచ్చటిస్తారు. ఇరు దేశాల స్నేహ బంధాన్ని పెంచుకునేం దుకు ఈ సమావేశం కీలకంగా మారనుంది.

పీఎఫ్ లోక్ అదాలత్ ద్వారా సమస్యల పరిష్కారం


కార్మికురాలితో మాట్లాడుతున్న కృష్ణమోహన్

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ, ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి నెలా పీఎఫ్ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు విశాఖ రీజియన్ ఈపీఎఫ్ నోడల్ అధికారి కె.వి.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక గాంధీనగరం అన్నపూర్ణ బ్యాంక్ రహదారిలో ఈఎస్ఐ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 50 మంది ప్రభుత్వ, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు పాల్గొన్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్మికులు నేరుగా విశాఖ పీఎఫ్ కార్యాలయానికి వచ్చి వారి వారి సమస్యలు చెప్పకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల 29వ తేదీన నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయంలో పీఎఫ్ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్మికుల సమస్యలు లిఖితపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదులు వారం రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఈపీఎఫ్ సీనియర్ అసిస్టెంట్‌లు పి.కామేశ్వరరావు, ఎస్.నిషాంత్, పెన్షనర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద చలివేంద్రం


రెడ్‌క్రాస్ సొసైటీ చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న డీఆర్వో

తుమ్మపాల: స్పందన కార్యక్రమానికి జిల్లాలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు చల్లని మజ్జిగ అందించడం మంచి కార్యక్రమం అని డీఆర్వో పి.వెంకటరమణ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఆయన ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ప్రతి సోమవారం కలెక్టరేట్ వద్ద మజ్జిగ పంపిణీ చేయడంతో ప్రజలు వేసవితాపం నుంచి సేద తీరుతున్నారన్నారు.

క్లుప్తంగా

నేడు గజ్జాలమ్మ పండగ

కశింకోట: మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం గజ్జాలమ్మ పండగ నిర్వహించనున్నట్లు సర్పంచ్ కన్నం శ్యాంసన్, ఉత్సవ నిర్వాహకుడు అద్దెపల్లి శ్రీనివాసరావులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. భక్తులు పాల్గోవాలని వారు కోరారు.

క్రీడా శిక్షణ శిబిరాలను వినియోగించుకోండి



ఎస్ఆర్‌డీ జిమ్ క్రీడాకారులతో శిలపరశెట్టి బాబీ

అనకాపల్లిటౌన్: ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలను పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్, నేషనల్ బాడీ బిల్డర్ అవార్డు గ్రహీత శిలపరశెట్టి బాబీ సూచించారు. స్థానిక వేల్పుల వీధిలోని ఎస్‌కేపీ, ఎస్ఆర్‌డీ జిమ్‌ల్లో క్రీడాకారులకు సోమవారం ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5 వరకు ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో క్రీడాకారుడికి నిత్యం కోడి గుడ్డు, ఎనర్జీ డ్రింక్, బిస్కెట్ ప్యాకెట్ అందజేస్తున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం ప్రభుత్వం సర్టిఫికెట్లు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ది అనకాపల్లి బాడీ బిల్డర్స్ ఫిట్నెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కృష్ణాజీ, కోచ్‌లు, క్రీడాకారులు, జిమ్‌ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీవోఏల ఆందోళన



ద్వాక్రా కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వీవోఏలు

పరవాడ: వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని వీవోఏల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఉమా, పి.రమా డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ద్వాక్రా కార్యాలయం ఎదుట సోమవారం వీవోఏలు ఆందోళన చేపట్టారు. కాల పరిమిత సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయడంతో పాటు రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 15 సంఘాల లోపు ఉన్న వీవోఏలకు వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వరలక్ష్మి, వెంకటలక్ష్మి, నీలిమ, నాగమణి, పైడిలక్ష్మి, విజయ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 340 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	4,010	4,900
మూడో రకం	3,700	4,000

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	-రాజా
రామభాణం	-సత్యనారాయణ-1
అన్నీమంచి శకునములే	-సత్యనారాయణ స్క్రీన్-2
2018	-షిర్డిసాయి
ఉగ్రం	-పర్తిసాయి
ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్10	-వెంకటేశ్వర
మళ్లీపెళ్లి	-శ్రీసత్య
బిచ్చగాడు-2	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ×ఏ× పాజిటివ్-5 యూనిట్లు, ×బీ× పాజిటివ్-5 యూనిట్లు, ×ఓ× పాజిటివ్-30 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం అందుబాటులో కలదు. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్యను 98484 18400 నంబర్‌లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 395 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 329 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని 94411 08144 నంబర్‌లో సంప్రదించవచ్చు.

సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధత

- పదో తరగతి తప్పిన వారికి ప్రత్యేక తరగతులు
- ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లతో బోధన
- విద్యార్థులు విద్యాసంవత్సరం కోల్పోకుండా చర్యలు



తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో పదో తరగతి విద్యార్థులు

అనకాపల్లి రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. వారికి సబ్జెక్టు టీచర్లతో ప్రత్యేక తరగతుల నిర్వహణకు చర్యలు చేపట్టింది. ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులై తమ తోటి విద్యార్థులతో పాటుగా ఇంటర్మీడియట్, డిప్లమో, ఐటీఐ వంటి కోర్సుల్లో చేరేలా కార్యాచరణ రూపొందించింది. ఇందుకోసం ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ తదితర ప్రభుత్వ అధీనంలో నిర్వహిస్తున్న స్కూళ్లలో రెమెడియల్ తరగతులు నిర్వహిస్తున్నారు. అనకాపల్లి మండలంలో 19 పాఠశాలలకు చెందిన 1570 మంది (ప్రైవేటు స్కూళ్లు కాకుండా) విద్యార్థులు గత నెలలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 1149 మంది ఉత్తీర్ణులు కాగా, 421 మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. వారికి సప్లిమెంటరీ పరీక్షలను వచ్చే నెల 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. వారికి విద్యాసంవత్సరం వృథా కాకుండా, ఆయా సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతుల నిర్వహణకు కార్యాచరణ రూపొందించింది.

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసే వరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు గాను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రతి రోజు సబ్జెక్టులు, పీరియడ్ల వారీగా కాల నిర్ణయ పట్టిక తయారు చేశారు. సబ్జెక్టుల వారీగా ఫెయిలైన విద్యార్థుల జాబితా తయారు చేసి, వారిని చైతన్యపరిచి అందరూ తరగతులకు తప్పనిసరిగా హాజరయ్యేలా చూస్తున్నారు. ఉపాధ్యాయులు గణితం, సైన్సు వంటి ముఖ్యమైన సబ్జెక్టుల విషయంలో మరింత శ్రద్ధ పెడుతున్నారు. ప్రతి రోజూ పరీక్షలు నిర్వహించడంతో పాటు, గత పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాల్లోని ముఖ్యమైన ప్రశ్నలను విద్యార్థులకు తెలియజేసి వారితో ప్రాక్టీస్ చేయిస్తున్నారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ ప్రత్యేక రెమెడియల్ తరగతులు జరుగుతున్నాయి. ఆ సమయంలో విద్యార్థులను శ్రద్ధగా చదివించడమే కాకుండా వారి సందేహాలను సంబంధిత సబ్జెక్టు టీచర్లు నివృత్తి చేస్తున్నారు. విద్యార్థులు కూడా ఎంతో ఆసక్తితో పాఠాలను అర్థం చేసుకుంటూ చదువుతున్నారు. ఉపాధ్యాయులు కూడా శతశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

ఉత్తీర్ణతే లక్ష్యంగా..



పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు మంచి అవకాశం. వారు కూడా ఆసక్తితో చదువుతున్నారు. తాము కూడా తోటి విద్యార్థుల మాదిరి టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో చదువుతున్నారు. రోజుకు రెండు సబ్జెక్టుల్లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు క్రమశిక్షణతో వారిని చదివిస్తున్నాం.

– బి దివాకర్, ఎంఈవో, అనకాపల్లి

విద్యా సంవత్సరం కోల్పోకుండా..



విద్యార్థి ఏ సబ్జెక్టులో ఫెయిలైతే ఆ సబ్జెక్టు ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పించడంతో పాటు రోజువారీ పరీక్షలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు ఎంతో విలువైన విద్యా సంవత్సరం కోల్పోకుండా చేయడానికి ప్రభుత్వం ఈ కొత్త విధానాన్ని అమలు చేయడం ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలి.

– ఎస్. శ్రీనివాసరావు, హెచ్‌ఎం, జెడ్‌హెచ్‌ఎస్, తుమ్మపాల

కేజీబీవీలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు సబ్బవరం కేజీబీవీ ఎస్‌వో మృదుల తెలిపారు. ఏడాది కాలపరిమితితో భర్తీ చేయనున్నట్టు పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి వారు ఏపీ కేజీబీవీ వెబ్ సైట్‌లో వచ్చే నెల 4వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు 18 నుంచి 42 ఏళ్లు, ఎస్సీ,ఎస్టీ,బీసీలకు 5 సంవత్సరాలు,మాజీ సైనిక ఉద్యోగులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాలు వయోపరిమితి సడలింపు ఉంటుంది. జిల్లాల వారీగా సబ్జెక్టు వారీగా, రోస్టర్ వారీగా పోస్టుల తెలుసుకోవాలని పేర్కొన్నారు.

నేడు జాబ్‌మేళా

మునగపాక : స్థానిక ఎంఎస్ఆర్ నేషనల్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 10గంటలకు ఐసీఐసీఐ ఆధ్వర్యంలో జాబ్‌మేలా జరుగుతుదని నిర్వాహకులు తెలిపారు. బీఎస్సీ,బీకాం,బీఏ తదితర చదువులు పూర్తి చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఏడాదికి రూ.2.6 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ప్యాకేజీ ఉంటుందన్నారు. 25 సంవత్సరాల లోపు వయస్సున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీ, తెలంగాణలో ఉద్యోగ సదుపాయం ఉంటుందన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ కోరారు. మరిన్ని వివరాలకు 9989282524, 9182020936 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



స్టోరీ రైటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. గ్రంథాలయ అధికారి వి. శిరీష ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు స్టోరీ రైటింగ్, ఆటల పోటీలు నిర్వహించారు.వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో సబ్బవరంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న కిల్లాడ ప్రసాదరావు

మునగపాక: ప్రతి విద్యార్థి చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కిల్లాడ ప్రసాదరావు కోరారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం మునగపాక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు దేశభక్తి గీతాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వికాసానికి, దేశభక్తిని పెంపొందించేందుకు దేశభక్తి గీతాలు దోహదపడతాయన్నారు. గ్రంథాలయాధికారి ఎల్.వి.రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకోటి దుర్గాప్రసాద్,పిల్లా జగదీష్ పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందనలు



కరాటేలో సత్తా చాటిన డ్రాగన్‌లైన్స్ విద్యార్థులు

పరవాడ: విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ ఇండో నేపాల్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో డ్రాగన్‌లైన్స్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ప్రతిభ చూపి పతకాల పంట పండించారు. ఈ కరాటే పోటీల్లో తిక్కవానిపాలెం, సమ్మెంగపాలెం, గంగునాయుడు పాలెం, వాడచీపురుపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు బి.హారిక, ఎస్.అను, కె.రాఘవేంద్ర స్వామి, కణితి రాధాకృష్ణలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బంగారు, వెండి, రజత పతకాలను సొంతం చేసుకున్నారని గ్రాండ్ మాస్టర్ ఎస్.నూకరాజు చెప్పారు. పతకాల పంట పండించిన విద్యార్థులను సోమవారం నూకరాజు, కోచ్‌లు ఓలిశెట్టి ప్రసాద్, ఎం.తులసీరావు అభినందించారు.

పిడుగుపాటుకు పశువుల పాక దగ్ధం



పిడుగుపాటుకు కాలిపోయిన పశువుల పాక

మాడుగుల రూరల్: పిడుగుపాటుకు పశువులు పాక దగ్ధమైంది. మండలంలో వీరవల్లి అగ్రహారంలో శానాపతి రమణకు చెందిన పశువుల పాక ఆదివారం రాత్రి దగ్ధమైంది. పిడుగు పడేటప్పుడు పశువులు లేకపోవడం వల్ల ప్రమాదం తప్పింది. జి. అగ్రహారం రహదారిలో సుంకర వారి కళ్లాల వద్ద జరిగిన ఈ ప్రమాదంలో వ్యవసాయ పనిముట్లు, యూరియా బస్తా కాలిపోయాయని బాధిత రైతు వాపోయాడు. స్థానికుల సమాచారం మేరకు మాడుగుల అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.30 వేల ఆస్తి నష్టం వాటిల్లింది.

6న దేవరాపల్లిలో సన్యాసమ్మ తల్లి పండగ



పండగ పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: స్థానిక సన్యాసమ్మ అమ్మవారి పెద్ద పండగను వచ్చేనెల 6న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పండగ సందర్భంగా స్థానిక రైవాడ జలాశయం అతిథి గృహం వద్ద గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సోమవారం గోడపత్రికను విడుదల చేశారు. 12 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న పండగకు హాజరు కావాలని ఆయన్ను కమిటీ సభ్యులు కోరారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, గండిపడాల అప్పలరాజు, తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని శాఖ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ధాన్యం చేయడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుందని, మన సనాతన సంప్రదాయాల్లో భాగంగా ఏదైనా పనిచేసేందుకు ముందు ధ్యానం చేసేవారని గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు తెలిపారు. ధ్యానం చేయడం వల్ల మనసు తేలిక పడుతుందన్నారు.

ఆరు మాసాల్లో లబ్ధిదారులకు జగనన్న గృహాలు

- కార్పొరేటర్ మందపాటి సునీత
- మామిడిపాలెంలో గృహ నిర్మాణాలకు శంకుస్థాపన



గృహ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ సునీత

అనకాపల్లిటౌన్: జగనన్న గృహాలను యుద్ధప్రాతిపదికన నిర్మించి, ఆరు మాసాల్లో లబ్ధిదారులకు అందజేస్తామని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. మండలంలోని మామిడిపాలెం గ్రామంలో జగనన్న గృహాల నిర్మాణానికి సోమవారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనకాపల్లి పట్టణంలోని 82, 83 వార్డు పరిధిలో నివసిస్తున్న నిరుపేద ప్రజలకు మొదటి దశలో 600 కుటుంబాలకు మామిడిపాలెం గ్రామంలో జగనన్న కాలనీ ఇవ్వడం జరిగిందన్నారు. ఆరుమాసాల్లో పూర్తి గృహాలు నిర్మించి లబ్ధిదారులకు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1,80,000 మంజూరు చేసిందని, ఇసుక, సిమెంట్, ఐరన్ ఉచితంగా అందజేస్తోందని చెప్పారు. డ్వాక్రా సంఘాల నుంచి లబ్ధిదారుల అనుమతితో రూ.35వేలు రుణంగా ఇస్తున్నట్లు తెలిపారు. రాయితీ ధరలతో 90 బస్తాల నాణ్యమైన సిమెంట్, 467 కేజీల ఇనుమును అందజేస్తున్నామన్నారు. అన్ని మౌలిక సదుపాయాలతో జగనన్న కాలనీలను ఆధునికంగా నిర్మిస్తామన్నారు. నిర్మాణపనుల్లో నాణ్యత లోపాలు లేకుండా చూడాలని కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ గృహ నిర్మాణ శాఖ డీఈ కె.మధురవాణి, ఏఈ గంటా పింకీ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, సచివాలయం ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటు



మజ్జిగ అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: కరుణామయుడు ఎంటర్‌ప్రైజెస్, అబ్దుల్ కలాం సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నెహ్రూ చౌక్‌లో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని ముఖ్య అతిథి పాస్టర్ తిమోతి ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చి ఉపశమనం కలిగించేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వారం రోజుల పాటు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం సేవా సంస్థ చైర్మన్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్, ఎంటర్‌ప్రైజెస్ అధినేత నగిరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద..

మెయిన్ రోడ్డులోని వేల్పుల వీధి గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద వ్యాపారవేత్త గాంధీ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి మద్దాల నూకరాజు మాట్లాడుతూ 3 వేల మందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు. ఆలయం వద్ద 24 గంటలు చల్లని తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు బొండా వాసు, బుదిరెడ్డి మురళీ, కరణం నాగు, బి.లోవరాజు, పి.శ్రీరామ్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో భద్రతా నియమాలు పాటించాలి



బ్యాంక్ అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న సీఐ షేక్ గఫూర్, ఎస్ఐలు

యలమంచిలి : బ్యాంకుల్లో విధిగా భద్రతాపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని యలమంచిలి సీఐ షేక్ గఫూర్ అన్నారు. సోమవారం యలమంచిలి పట్టణ పోలీస్ కార్యాలయంలో వివిధ బ్యాంకుల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల బ్యాంకుల్లో జరుగుతున్న చోరీల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని, బ్యాంకుల్లో కూడా సీసీ కెమెరాలు, పటిష్ట స్ట్రాంగ్ రూమ్‌ల్లో విలువైన పత్రాలు, డాక్యుమెంట్స్ నగదు లావాదేవీలకు సంబంధించిన బంగారు వస్తువులు, ప్రత్యేక చర్యలతో నడుమ భద్రపరచాలని కోరారు. తరచూ బ్యాంకులకు వస్తున్న అపరిచిత వ్యక్తులను గుర్తించి తమకు సమాచారం తెలపాలన్నారు. బ్యాంకులు ఏటీఎంల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడు, రూరల్ ఎస్ఐ సన్నిబాబు పాల్గొన్నారు.

మునగపాక : దొంగతనాలు జరగకుండా ఉండేందుకు అవసరమయ్యే జాగ్రత్తలు తీసుకోవాలని యలమంచిలి సీఐ గఫూర్ కోరారు. మునగపాక పోలీసు స్టేషన్‌లో సోమవారం సాయంత్రం పలు బ్యాంకర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఏటీఎంలు, బ్యాంక్‌ల వద్ద దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇందుకోసం ప్రతి బ్యాంక్ వద్ద సీసీ కెమెరాలతో పాటు రాత్రి సమయంలో సెక్యూరిటీ గార్డ్ ఉండేలా చూడాలన్నారు. అలాగే ఆలారమ్ సదుపాయం కల్పించుకోవాలన్నారు. దీనికి తోడు బ్యాంక్‌ల వద్ద ప్రజలను అప్రమత్తం చేసే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల సొమ్ముకు భద్రత కల్పించాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. అలాగే సైబర్ మోసాలు పెరుగుతున్నాయన్నారు. ఎస్ఐ మహమ్మద్ ఆలీ సమావేశంలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

అనకాపల్లిటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధురాలు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. రూరల్ ఎస్ఐ నరసింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మేడివాడ గ్రామానికి చెందిన చెవ్వేటి పైడితల్లమ్మ(73) ఆమె మనుమడు చెవ్వేటి రాజు బైక్‌పై రెండురోజుల క్రితం గాజువాక ఆస్పత్రికి వెళ్తుండగా మార్గ మధ్యలో బీఆర్టీ కాలనీ వద్ద ఆమె బైక్‌పై నుంచి పడిపోయింది. ఈ ప్రమాదంలో పైడితల్లమ్మ తలకు తీవ్ర గాయమైంది. ఆమెను చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు కోటమ్మతల్లి పండగ



నాతవరం: కోరిక కోర్కెలు తీర్చే కల్పవల్లి కోటమ్మతల్లి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. స్థానిక కోటమ్మతల్లి పండగను గ్రామస్తులు మూడేళ్లకోసారి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా గ్రామంలో భారీ విద్యుద్దీపాలంకరణతో ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ డి. లక్ష్మీనారాయణ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.